నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 30 జులై 2023

నీటిలోనే వైకుంఠధామం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడ్పల్లి వైకుంఠధామం ఇంకా నీటిలోనే ఉంది. వైకుంఠ ధామం కట్టడాలు కట్టకముందే ఆలోచనలు ఉంటే ఈరోజు ఈ పరిస్థితి ఉండేది కాదని చెరువుకు సమీపంలోనే ఈ వైకుంఠధామం నిర్మాణం చేపట్టడంతో వర్షకాలంలో దహన సంస్కరణలకు రాకపోకలు సాగించాలన్న నీటి నుండే రాకపోకలు సాగించవలసి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.



వైకుంఠధామంలో నిలిచిన నీరు

పాముల కాటుతో రెండేండ్ల బాలుడు మృతి

నవతెలంగాణ-నవీపేట్



రెండు పాములు కాటు వేయడంతో బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని బినోల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. భూమేష్ భార్య హర్షిత ఇద్దరు పిల్లలతో కలిసి నిద్రపోతున్న సమయంలో శుక్రవారం అర్ధరాత్రి పెంకుటిల్లు పైనుండి రెండు పాములు పడి రెండేళ్ల బాలుడు మంగలి రుద్రాన్ష్‌కు కాటువేశాయి. బాలుడు ఏడవడంతో తల్లి లేచి పాములను పట్టుకొని విసిరి పారేసింది.నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం 5 గంటలకు మృతి చెందాడు. బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

వేల్పూర్‌లో ఆర్టీవో ఎక్స్‌టెన్షన్ ఆఫీస్

- త్వరాలో ఏర్పాటు చేస్తాం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



తాత్కాలిక ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-వేల్పూర్

బాల్కొండ నియోజకవర్గ యువతి యువకుల కోసం ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించే కార్యక్రమంలో భాగంగా వేల్పూర్ మార్కెట్ కమిటి ప్రాంగణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్లాట్ బుకింగ్, లెర్నింగ్ లైసెన్స్ అందజేసే ఆర్టీవో ఎక్సటెన్షన్ ఆఫీస్ సెంటర్‌ను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, స్లాట్ బుకింగ్ సిస్టమ్, లైసెన్స్ జారీ చేసే ప్రక్రియను పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలు అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్లాట్ బుకింగ్ కోసం వచ్చిన యువకులతో మంత్రి ముచ్చటించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గంలో వేల్పూర్ ఎక్స్‌రోడ్డులో త్వరలో పర్మినెంట్ ఆర్టీవో ఎక్సటెన్షన్ ఆఫీస్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆర్మూర్ కు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నదని నియోజకవర్గంలోని దూర ప్రాంతాల మండలాలు ప్రజలకు అది అసౌకర్యంగా ఉన్నదని అన్నారు. అందుకే బీఆర్ఎస్ తరుపున సొంత ఖర్చులతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కు యువత నుండి విశేష స్పందన వస్తోందని, ఇప్పటికే సుమారు 7వేల మంది యువకులు లైసెన్స్ కోసం అప్లై చేసుకున్నారనీ తెలిపారు. ఆర్మూర్ ఆర్టీవో ఆఫీస్ వెళ్లే ఇబ్బందులు లేకుండా వేల్పూర్‌లోనే ఎక్సటెన్షన్ ఆఫీస్ ఏర్పాటు చేసుకున్న మన్నారు. బాల్కొండ నియోజకవర్గానికి ఆర్టీవో ఎక్స్ టెన్షన్ కార్యాలయం కావాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ను అడిగిన మూడు గంటల్లోనే దానికి సంబందించిన ఉత్తర్వులు జారీ చేశారన్నారు. లైసెన్స్ లేదని పోలీసు చెకింగ్ లు తప్పించుకోవడానికి గల్లిలల్లో, రోడ్ మీద స్పీడ్‌గా వెళ్లి యువత ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఇక నుండి తప్పుతుందని, దర్జాగా జేబులో లైసెన్స్‌తో వెళ్ళొచ్చని చమత్కరించారు.





లైసెన్స్ కోసం చేపట్టిన ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి వేముల

'పంచాయతీ'లపై సర్కారు పగ

- కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తాత్సారం
- 24 రోజులుగా సమ్మెలోనే
- సమ్మె తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నాలు
- రెండు జిల్లాలో పేరుకుపోతున్న చెత్త
- రేపు నిజామాబాద్‌లో కలెక్టరేట్ ముట్టడి



నవీపేట్‌లో పేరుకుపోయిన మురికి



సాలూరలో

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపచేయడంలో సర్కారు తాత్సారం చేస్తుండటంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విరజిల్లాల్సిన పల్లెలు.. కంపుకొడుతున్నాయి. ప్రతిరోజూ గ్రామాలను అద్దంలా తీర్చిదిద్దే కార్మికులను సర్కారు పట్టించుకోవడం లేదు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి కష్టపడిన కార్మికుల కడుపులు మాడ్చుతోంది. ఓ వైపు కేంద్ర సర్కారు వద్ద పంచాయతీలకు అవార్డులు తీసుకుంటూ.. అందులో కీలకమైన పంచాయతీ కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదు. అసలే నిధులు లేక నిరసించిన సర్పంచులకు సర్కారు మౌనం మరింత ఆగ్రహం తెప్పిస్తోంది. అభివృద్ధి కోసం అప్పులు చేస్తే.. సర్కారు పట్టించుకోక సమ్మె కొనసాగుతుండటంతో పంచాయ తీలు చెత్త కుప్పలా మారుతున్నాయని వాపోతున్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు పెంచాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేస్తూ జులై 6వ తేదీ నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలవ్యాప్తంగా పంచాయతీ కార్మికులను సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. కార్మిక సంఘాలు ఏకతాటిపైకి వచ్చి తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీగా ఏర్పాటు అయి సమ్మెను విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. సమ్మెను విరమింపచేసేందుకు సర్కారు ప్రయత్నించకుండా... సమ్మె తీవ్రతను తగ్గించేందుకు యత్నించడంపై కార్మికులు, సిబ్బంది తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. నవీపేట్ లాంటి మండలాల్లో ఏకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి మరీ ప్రయివేటు వ్యక్తులతో పని చేయించే ప్రయత్నం చేశారు. కానీ కార్మికులు ఏకమై అడ్డుకున్నారు. ఈ దశలో అరెస్టులు, కేసులకు కూడా వెనకాడటం లేదు. నిజామాబాద్, కామారెడ్డి, బోధన్, ఆర్మూర్ తదితర ప్రాంతా ల్లో కార్మి కులను భయపెట్టి స్తున్నారు. సమ్మె విరమించి పనుల్లో చేరకపోతే ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరిస్తున్నారు. ప్రస్తుతం కోటగిరి, రుద్రూరు, చందూరు, వర్నిలో పోటీ కార్మికులతో పని చేయించేందుకు తీవ్రం గా ప్రయ త్నాలు జరుగుతు న్నాయి. కానీ కార్మికులు వెనక్కు తగ్గడం లేదు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమం వీడబోమని స్పష్టం చేస్తున్నారు. అందుకు ఇటీవల కామారెడ్డి జిల్లాలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి నిదర్శనంగా నిలుస్తోంది. ఓ వైపు భారీ వర్షాలు ఉన్నప్పటికీ.. సుదూరప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి ధర్నాలో పాల్గొన్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే :

పంచాయతీ కార్మికులను, సిబ్బందిని రెగ్యులర్ చేయాలి. కారోబార్, బిల్ కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలి. 11వ పీఆర్సీలో నిర్ణయించిన మేర కనీస వేనతం రూ.19 వేలు చెల్లించాలి. ఆ లోపు జీఓనెం.60 ప్రకారం కేటగిరిల వారీగా వేతనాలు రూ.15,600, రూ.19,500 చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదంలో మరణించిన కార్మిక కటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. కేంద్ర సర్కారు తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, జీఓ నెం.51ని సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గ్రాట్యుటీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతున్నారు.

31న కలెక్టరేట్ ముట్టడి..

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 31వ తేదీన నిజామాబాద్ కలెక్టరేట్ ముట్టడి పిలుపునిచ్చారు. సమ్మెపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించ డంపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. జిల్లానలుమూలల నుంచి కార్మికులను సమీకరించి ముట్టడి విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కుట్రలను ఐక్యంగా తిప్పికొడతాం

నూర్జహాన్,
సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



పంచాయతీ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇది జరుగుతోంది.సమ్మెలో పాల్గొన్న కార్మికులను పని చేయాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. పైగా కొన్ని మండలాల్లో ప్రయివేటు వ్యక్తులను పోటీగా తీసుకొచ్చి పని చేయిస్తున్నారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇది సరికాదు. కార్మికులు చట్టబద్ధంగా సమ్మె నోటీసులు ఇచ్చి... సర్కారు నుంచి స్పందనరాకపోవడంతోనే సమ్మె చేపడుతున్నారు. సమ్మె విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఐక్యంగా తిప్పికొడతాం.

స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా నియమితులైన జగదీష్ చందర్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. క్రమ శిక్షణతో సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది బాగోగులను తెలుసుకొని ఆరోగ్యం కాపాడు కొంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పేకాట, గంజాయి లాంటి వాటిని నిర్మూలించాలని, దొంగతనాలను అరికట్టాలని, కేసుల త్వరితగతిన విచారణ చేపట్టి నేరస్తులకు తొందరగా శిక్షపడేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.సురేష్ బాబు, ఎస్ఐలు గంగాధర్, అశోక్ పోలీస్ సిబ్బంది రాజన్న పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ

- సీఐటీయూలో మిషన్ భగీరథ కార్మికుల చేరిక



సీఐటీయూలో చేరిన మిషన్ భగీరథ కార్మికులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కార్మికులకు, శ్రమజీవులకు అండగా వెన్నుదన్నుగా సీఐటీయూ నిలుస్తుందని యూనియన్ జిల్లా నాయకులు ఖలీల్ తెలిపారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని బీర్కూర్ చౌరస్తా ఎస్ఎంబి ఫంక్షన్ హాల్‌లో మిషన్ భగీరథ కార్మికులు సీఐటీయూలో చేరారు. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో పనిచేస్తున్న 70 మంది కార్మికులు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు అండగా, శ్రమజీవులకు వెన్నుదన్నుగా అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియులో మిషన్ భగీరథ కార్మికులకు ఆయన స్వాగతం పలికారు. మిషన్ భగీరథ కార్మికులు మంచి నిర్ణయం తీసుకున్నారని కార్మికుల కోసం పని చేసే ఏకైక సంఘం సిఐటియు అని తెలిపారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యల పైన ఎల్లవేళలా ప్రభుత్వాలతో పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ డివిజన్ కార్మికుల్లో అధ్యక్షునిగా రూప్ సింగ్‌ని కార్యదర్శిగా పండరిని కోశాధికారి మొగులయ్యని ఉపాధ్యక్షుడిగా బాలరాజుని సలహాదారుడిగా అంబర్ సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితులున్నారు.

కేంద్రం కనుసైగలోనే
మణిపూర్ మరణహోమం

- పార్లమెంట్‌లో చర్చించాలి
- సెమినార్‌లో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు అబ్బాస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం కనుసైగలోనే మణిపూర్ మరణహోమం జరిగిందనే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, కేంద్ర ప్రభుత్వం మణిపూర్ ఘటన పైన పార్లమెంట్లో చర్చించాలని ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకులు మొహమ్మద్ అబాస్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ - జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మణిపూర్ మరణకాండపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు అధ్యక్షతనగా ఈవీల్ నారాయణ వహించగా.. ముఖ్యఅతిథిగా అబ్బాస్ హాజరై ప్రసంగించారు. మణిపూర్ మరణకాండ కేంద్రం కనుసైగలోనే జరిగిందని వాస్తవాలు బయటపడ్డాయని రెండు నెలలుగా అనేక సంఘటనలు జరుగుతున్న మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మణిపూర్‌లో కుకి, మైతి తెగలకు కేంద్రం మతాన్ని అంటగాడుతూ రాజకీయం చేయడం అప్రజాస్వామ్యమని అన్నారు.



మాట్లాడుతున్న అబ్బాస్

కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌పై విషాన్ని చిమ్మకుండ నైతిక బాధ్యతతో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. మణిపూర్ ప్రభుత్వ పోలీస్ శాంతి భద్రతల వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. మోడీ ప్రభుత్వం పార్లమెంటు సమావేశాల్లో మణిపూర్ ఘటన పైన స్పందించకపోవడం ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందని విమర్శించారు. బాధ్యత గల ఎంపీ పదవి లో ఉన్న మహిళ హిందు సమాజంలో మానభంగాలు, మారణహెూమలు సహజం అనడం దారుణం అని అన్నారు.

ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవ రావు మాట్లాడుతూ మణిపూర్ ప్రజలను రక్షించాలని, అగ్నిజ్వాలను చల్లార్చాలని అన్నారు. దేశానికి గుజరాత్ మోడల్ అని గొప్పలు చెప్తున్నా గుజరాత్ మోడల్ అంటే మైనార్టీలపై దాడులు చేయడమే అని అన్నారు. కుకీ, మైతీ తెగలలో గొడవలకు కేంద్రం బాధ్యత వహించి శాంతి భద్రతలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లు స్వరాజ్యం ట్రస్ట్ జిల్లా కార్యదర్శి కె. రామ్మోహన్ రావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు నర్రా రామారావు, శంతన్, పెన్షనర్స్ నాయకురాలు నిర్మల, మదన్మోహన్, నూర్జహాన్,రమేష్ బాబు, కోపేడి నర్సింహులు, ఆనంద్, సిర్పలింగం, తదితరులు, రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ఎకరాకు
రూ.25 వేల పరిహారం చెల్లించాలి

- ఇంట్లో నీరు చేరి నష్టపోయిన వారికి రూ.10 వేలు చెల్లించాలి : సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరదలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని పంట నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడారు. కేంద్ర విపత్తు సహాయ నిధి కింద నిజామాబాద్ ఎంపీ అరవింద్ తక్షణమే నిధులను మంజూరు చేయించి ప్రజలను ఆదుకోవాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వరదల వలన పంట పొలాల్లో ఇసుకమేటలు పేరుకు పోయి పంట నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించటం తో పాటు పంట రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 'గ్రామాల్లో, పట్టణాల్లో వరద తాకిడికి చెరువులు వాగులు పొంగి, కట్టలు తెగి ఇండ్లలోకి నీరు చేరి వంట సరుకులతో పాటు అన్ని తడిసి పాడైపోయాయి. అదేవిధంగా జిల్లాలో అనేక రోడ్లు దెబ్బతిని కోతలకు గురై నడవడానికి కూడా వీలు లేకుండా గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పట్టణంలో అనేక రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో పాటు నీరునిలో ఉండటం వలన నడవడానికి కూడా వీలు లేకుండా మారాయని కావున వెంటనే ప్రభుత్వం నిధులను మంజూరు చేసి తెగిన చెరువులను వాగులను మరమ్మతులు చేపట్టి పాడైపోయిన రోడ్లను పునరుద్ధరించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25000 చెల్లించి రుణాలను ఇవ్వాలని ఇండ్లలో నీరు చేరి సరుకులను కోల్పోయిన వారికి 25 కిలోల బియ్యం 10,000 రూపాయలు తక్షణ సాయం కింద అందించాలని, యుద్ధ ప్రాతిపాదికన రోడ్లను మురికి కాల్వలను పునరుద్ధరించాలని, ఇండ్లు కూలి, నష్టపోయిన వారికి 25 వేల రూపాయలు తక్షణ సహాయం చెల్లించటం తో పాటు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, ఆసిఫ్ పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-నందిపేట్

చెరువులో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కౌల్‌పూర్ గ్రామానికి చెందిన పోచమ్మల ఎల్లప్ప (35) తన స్నేహితులతో కలిసి గురువారం ఉదయాన్నే శాపూర్ శివారులోని కుద్వాన్‌పూర్ చెరువు అలుగు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. అయితే చేపలు పడుతున్న సమయంలో ఎల్లప్ప గల్లంతయ్యాడు. ఎల్లప్పతోపాటు మరో వ్యక్తి దుర్గయ్య అలుగులోకి దిగగా ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నంలో ఎల్లప్ప మునిగిపోయాడని, తనతో పాటు దిగిన వ్యక్తి ప్రవాహంలో కొద్ది దూరం కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డాడని వారితో పాటు చేపలు పట్టేందుకు వచ్చిన మిత్రులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎమ్మార్వో అనిల్ కుమార్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు సందర్శించి గల్లంతు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. అయితే శనివారం మృతదేహం పైకి తేలడంతో బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని బయటకు తీసి బంధువుల ఫిర్యాదు మేరకు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి పంపించినట్టు ఏఎస్ఐ రాజేందర్ తెలిపారు.

అడవిపై గొడ్డలి వేటు

- అటవీ సంపదను దోచేస్తున్న కబ్జాదారులు
- స్పందించని అటవీశాఖ అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఇటీవల వారం రోజులుగా వరుసగా కురిసిన భారీ వర్షాన్ని ఆసరా చేసుకొని పలువురు కబ్జాదారులు.. అటవీ ప్రాంతంలో చెట్లను నరికేశారు. ఇష్టానుసారంగా చెట్లను నరికి.. భూ కబ్జాకు తెరలేపారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణకు హరితహారం అనే కార్యక్రమాలతో ప్రభుత్వం ఒకవైపు చెట్లను పెంచాలని కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది. మరో వైపు అక్రమార్కులు అటవీ సంపదను కొల్ల గొడుతూ అటవీ అధికారులకు సవాలు విసురుతున్నారు. సరైన నిఘా ఉంటే కబ్జాదారుల ఆట కట్టవచ్చని ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తిమ్మాపూర్ తాండ అటవీ ప్రాంతంలో కొందరు భూ కబ్జాదారులు భూమిని ఆక్రమించు కోవడానికి అడవి ప్రాంతంలోని చెట్లను భారీ వర్షాన్ని లెక్కచేయకుండా నరికివేశారు. భూ కబ్జాదారుల గొడ్డలి వేటుకు కనుమరు గవుతున్న అటవీని రక్షించేందుకు అటవీశాఖ అధికారుల కళ్ళకు కానరావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. భూముల రేట్లు పెరగడంతో ఇదే అదునుగా భూ కబ్జా కోరులు పదుల ఎకరాలలో అటవీ భూములు ఆక్రమించు కుంటున్నా అటవీశాఖ అధికారులు ప్రేక్షపాత్ర వహిస్తున్నా రని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అటవీ అన్యాక్రాంతం అవుతున్నా అటవీశాఖ అధికారులు తమ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో పర్యవేక్షించకుండా అటవీ ని అన్యాక్రాంతం అవ్వడానికి అక్రమార్కులతో కుమ్మక్కై, పరోక్షంగా సహాయం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇదే అదునుగా భావించి భారీ వర్షానికి సైతం లెక్క చేయకుండా కబ్జాదారులు అడవిని అన్యాక్రాంతం చేయడనికి భారీ వృక్షాలను నరికేస్తున్నారు. సుమారు దాదాపు 10 ఎకరాల అటవీ ప్రాంతంలో గల చెట్లను నరికివేశారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులకు మాత్రం సమాచారం తెలిసినా తెలియకపోయిన ఆ వైపున కన్నెత్తి చూడడం లేదని దీని బట్టి చూస్తే కొంతమంది అటవీశాఖ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై ఆ వైపున వెళ్లడం లేదని పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. అటవీశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకొని అక్రమార్కులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.





ఇద్దరిపై కేసు నమోదు

ఎఫ్ఆర్ఓ ఓంకార్

తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలోని చెట్లను భూ కబ్జా కోరులు నరికినట్టు మా దృష్టికి వచ్చింది. వెంటనే వెళ్లి పరిశీలించాం. చెట్లు నరికిన వారిని గుర్తిస్తున్నాం. ఇద్దరిని గుర్తించి కేసు నమోదు చేశాం. మిగతా వారిని గుర్తించే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఎవరైనా అటవీ భూమి చదును చేస్తే చర్యలు తీసుకుంటాం.

నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లు, రోడ్లను బీజేపీ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. మండలంలోని పిప్రి, అహ్మద్‌తండా గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న వారికి ఇంటికి కప్పుకోవడానికి టార్పాలిన్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. 5రోజులుగా వర్షాలతో రోడ్లు, వంతెనలు పూర్తిగా కూలిపోయాయని తెలిపారు. వర్షపు నీరు ఇండ్లలోకి రావడానికి ఇక్కడున్న అవినీతి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, మాక్లూర్ మండలాధ్యక్షుడు సురేష్, నందిపేట్ మండలాధ్యక్షుడు సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన మల్లారం గ్రామ శివారులోని మేఘన డెంటల్ కాలేజీ వద్ద చోటుచేసుకుంది. గుర్తు తెలియని శవం ఉన్నట్టు స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. వృద్ధుడి వయసు సుమారు 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ప్యాంటు, చొక్కా ధరించి చేతి కర్ర కలిగి ఉన్నాడు. కాగా పోలీసులు శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. శవాన్ని గుర్తిస్తే నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేష్ 8712659849ను సంప్రదించాలని సూచించారు.

ప్రమాదాలకు ఆస్కారంగా కల్వర్టులు

- భారీ వర్షాలతో కోతకు గురి.. ప్రతిసారి ఇదే పరిస్థితి
- ఏండ్లు గడిచినా మరమ్మతులు కరువు
- గుంతలను నింపి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- గుంతలతో పొంచిఉన్న ప్రమాదం



వరద ప్రవాహానికి కల్వర్టు వద్ద కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిన రోడ్డు..



కల్వర్టు వద్ద నీటి ప్రవాహానికి పొలంలో ఇసుక మేటలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం నుంచి ఉప్లూర్ వెళ్లే దారిలో వరద కాలువ దిగువన బీటిపై ఉన్న రెండు కల్వర్టులు ప్రమాదాలకు ఆస్కారంగా మారాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కోతకు గురయ్యింది. కల్వర్టుకు ఇరువైపులా పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. అప్పటి నుంచి ఆ గుంతలను అధికారులు తాత్కలికంగా మొరంతో నింపి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇలా భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వరద తాకిడికి గుంతల్లో వేసి మొరం కొట్టుకుపోవడం, అధికారులు వాటిని మొరంతో నింపి కవర్ చేయడం శరమమూలుగా మారింది. గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన అతి భారీ వర్షాలకు కల్వర్టుల ఇరువైపులా పెద్ద ఎత్తున కోతకు గురై పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. ఆ సమయంలో భారీకి వచ్చిన వరదతో కల్వర్టుల కాలువ కూడా కోతకు గురవ్వడంతో పంట పొలాల్లోకి వరద నీరు చేరి ఇసుక, మట్టి మేటలు వేశాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పుడు కూడా తాత్కాలికంగా మళ్ళీ మొరంతో నింపివదిలేశారే తప్ప అధికారులు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టలేదు. గత సంవత్సరం కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. పెద్ద ఎత్తున కల్వర్టులు ధ్వంసమై రెండేండ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారి గుండా వెళ్ళే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉండడమే కాకుండా కల్వర్టు దిగువన పంట పొలాలు భారీ వర్షాలు కురిసిన సందర్భంలో నీట మునుగుతున్నాయి.

కమ్మర్‌పల్లి గ్రామ శివారులో ఉప్లూర్ వెళ్ళే రోడ్డులో భూములు పల్లంగా ఉన్నందున వర్షపు వరద నీరు, పంట పొలాల నీరు ఉప్లూర్ వైపు ప్రవహిస్తోంది. పదేళ్ళ క్రితం కమ్మర్‌పల్లి శివారు గుండా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువ నిర్మాణం జరిగింది. కమ్మర్‌పల్లి వైపు నుంచి వర్షపు వరద, పంటపొలాల నీరు దిగువకు ప్రవహించే మార్గం లేకపోవడంతో ఈ ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగి, పంటలు దెబ్బతినడంతో వరద కాలువ కిందుగా అండర్ టన్నెల్ నిర్మించారు. ఈ టన్నెల్ గుండా బయటకు వెళ్ళే వరద నీరు, వరద కాలువ తూము నుంచి ఉప్లూర్ చెరువులోకి వరద కాలువ నీరు ప్రవహించేందుకు వీలుగా బీటీ రోడ్డు కిందుగా పైపు వేసి కల్వర్టు నిర్మించి, కాలువ తవ్వారు. భారీ వర్షాలు కురిస్తే ఈ కాలువ గుండా నీటి ప్రవాహం జోరుగా ఉంటుంది. రెండేళ్ళ క్రితం వర్షాకాలంలో భారీ వర్షాలతో ఈ కల్వర్టు గోడలు పూర్తిగా విరిగి పడ్డాయి. దీంతో బీటీ రోడ్డుపైన వర్షపు నీరు నేరుగా కాలువలోకి ప్రవహించి ఆ సమయంలో కల్వర్టు దిగువన గల పంట పొలాలు నీట మునిగాయి.

అప్పటి నుంచి కల్వర్టు మరమ్మతులు నోచుకోనేలేదు. దీంతో భారీ వర్షాలు పడ్డ ప్రతిసారి క్రమంగా కల్వర్టు రెండు వైపుల గోడల భాగం నుంచి బీటీ రోడ్డు అంచు వరకు రోడ్డు కోతకు గురయ్యింది. బీటి రోడ్డు సగం వరకు కోతకు గురవ్వడంతో పాటు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వరద ప్రవాహం ఎక్కువగా ఉండడం, కాలువ, కల్వర్టు కింద వేసిన పైపు చిన్నగా ఉండడంతో వరద నీరు బీటి రోడ్డు మీదుగా కల్వర్టు పైనుంచి ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఈ రోడ్డు గుండా ఇరు గ్రామాలకు రాకపోకలు సాగడం లేదు. ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలతో వచ్చిన వరదకు గత సంవత్సరం గుంతల్లో నింపిన మొరం పూర్తిగా కొట్టుకుపోయింది.

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం..

భారీ వర్షాలతో కల్వర్టుల వద్ద ఏర్పడ్డ గుంతలతో ఈ రోడ్డు గుండా రాత్రి వేళల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. బీటీ రోడ్డు సగం వరకు కోతకు గురవ్వడంతో ప్రస్తుతం ఈ రోడ్డులో ఒక వైపు నుంచి మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. రాత్రి పూట వాహనదారులు ఆదమరిచి కల్వర్టు వైపు వెళ్ళితే గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉంది. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కల్వర్టు ప్రదేశంలో స్లాబ్ ఎత్తుగా స్లాబ్ కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఇందుకు ఇప్పటికే మంత్రి ప్రశాంత్‌రెడ్డి నిధులు కూడా మంజూరు చేయించినట్లు తెలిసింది.

చర్చల్లో జాప్యం చేస్తున్న మంత్రి

- పంచాయతీ కార్మికుల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు



నవీపేట్ : కాంగ్రెస్ నాయకుల మద్దతు



వర్ని : చెవిలో పూలు పెట్టుకుని నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

జక్రాన్‌పల్లి : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికు ల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని గత 24 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో పలు సమ స్యలు ఉత్పన్నమవుతున్నాయని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాష్ట్ర జేఏసీ కన్వీనర్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు అన్నారు. జక్రాన్ పల్లి సమ్మె శిబిరంలో దాసు పాల్గొని మాట్లాడుతూ స్థానిక నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే గారికి జక్రాంపల్లి జేఏసీగా వినతి పత్రాలు ఇచ్చారని దాసు తెలిపారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా ప్రత్యేక టీములు పేరుతో పంచాయతీ ఉద్యోగ కార్మికులపై ఒత్తిడి తేవడం మానుకోవాలని, సఫాయి కార్మికులే నిజమైన దేవుళ్ళు అన్ని సెల్యూట్ పెట్టిన చేతితో వేతనాలు పెంచి క్రమబద్ధీకరణ సంతకం చేయాలని దాసు కోరారు. ఉద్యోగ భద్రతను హరించే మల్టీపర్పస్ విధానం జీవో నెంబర్ 51ని వెంటనే రద్దు చేయాలని, కారోబార్లకు సహాయ కార్యదర్శిగా ప్రమోషన్, ప్రమాద బీమా 10 లక్షలు సాధారణ బీమా ఐదు లక్షలు రాష్ట్రంలో ఉన్న 50,000 మందికి పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వెంటనే వర్తింపజేయాలని దాసు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానీయ రాగానే చర్చలు కొనసాగిద్దామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తిరిగి చర్చలు జరపకుండా జాప్యం చేస్తున్నారని ఆయన అన్నారు. జూలై 31 చలో కలెక్టర్ కార్యక్రమాన్ని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని దాసు కార్మికులకు పిలుపునిచ్చారు. జక్రాన్‌పల్లి జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు సవీన్, భానుచందర్, నాయకులు బండి సాయన్న, సంతోష్, గోపి, చింతలూరు సాయన్న, సొప్పరి గంగాధర్, సర్వర్ లక్ష్మి, గున్నావా భూదేవి, భోజమ్మ, కలికోట రాజన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వులతో కార్మికుల నిరసన..

వర్ని(చందూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి కార్మికుల హక్కులను కాలరాస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచకుండా పొట్ట కొడుతుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మండిపడ్డారు. జేఏసీ నాయకులతో చర్చలు జరిపి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నవీన్, ఖలీమ్, గంగాధర్, జగదీష్, సురేష్, అబ్బయ్య, సుశీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని సమీపంలో గల ధర్నాచౌక్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు జంగం గంగాధర్ మాట్లాడారు. ఎడపల్లి మండల కో కన్వీనర్ గంగరాజు, కుంట సంతోష్, పాండు, బిల్ కలెక్టర్ల యూనియన్ అధ్యక్షులు రాజు, రహిమత్, వెంకగౌడ్, లక్ష్మణ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకుంది. సమ్మెలో కార్మికుల సంఘ అధ్యక్షులు రేఖ, కార్యదర్శి సాగర్, రాములు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్ళపై కూర్చొని పంచాయతీ కార్మికుల నిరసన..

కమ్మర్‌పల్లి : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మెలో భాగంగా 24వ రోజైన మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి క్రమబద్ధీకరించాలని, పంచాయతీ కార్మికులకు జీవోనెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కౌడ పోచయ్య, గంగా పోచయ్య, గంగ సాయిలు, సాధిరేం నరసయ్య, మైలారం బాల, కౌడ నర్సు, కారోబార్లు తలారి రాజేశ్వర్, బాజే సాహెబ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కారోబార్ మృతికి జీపి సిబ్బంది సంతాపం..

నవీపేట్ : మండల కేంద్రంలోని జీపీ సిబ్బంది శిబిరంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన కారోబార్ ఎర్రబాటి రాజు మృతికి శనివారం సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నాయక్ వాడి శ్రీనివాస్, మీన్‌కుమార్ మాట్లాడుతూ.. గత 23 రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సమ్మె విషయంలో మొండి వైఖరి అవలంబించడంతోనే రాజు మనస్థాపానికి గురై గుండెపోటుతో మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లక్క గంగారం, ఆంజనేయులు శీను, నరేష్, కారోబార్లు, కార్మికుల పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ మండల పార్టీ మద్దతు తెలిపింది. సమ్మె శిబిరంలో శనివారం 24వ రోజు జీపీ సిబ్బంది సమ్మె సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షులు సుధాకర్‌రావు పార్టీ నాయకులు సమ్మె శిబిరంలో కూర్చొని మద్దతు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం సఫాయి కార్మికులు, సిబ్బంది పట్ల మొండి వైఖరి అవలంబించడం సబబు కాదని అన్నారు. వెంటనే స్పందించి కార్మికుల సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ కుమార్ గౌడ్, సాయరెడ్డి, వడ్డే రవి, ధీరజ్, మూస, వార్డు సభ్యులు సుల్తానా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ నుంచి.. ఆర్డీవో వరకూ..

- పదోన్నతి పొందిన బావయ్య
- మిర్దాపల్లి గ్రామస్తుల హర్షం



నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలోని నలుగురు తహసీల్దార్‌లకు పదోన్నతులు లభించడం.. అందులో నూతన ఆలూర్ మండలంలోని మిర్ధాపల్లి గ్రామానికి చెందిన బావయ్య ఉండడంతో ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన బావయ్య విధి నిర్వహణలో నిస్వార్థపు సేవలు చేస్తూ.. ఉద్యోగంలో పదోన్నతి పొందడం ఎంతో అభినందనీయమని మిర్ధాపల్లి వాసులు కొనియాడారు.

ఇదీ ఉద్యోగ నేపథ్యం..

చిన్ననాటి నుంచి కష్టపడి చదువుతూ 2007 సంవత్సరంలో గ్రూపు-2కు ఎంపికయ్యారు బావయ్య. మహబూబ్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2012 జనవరి 28న బాల్కొండ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టి.. 2014 ఫిబ్రవరి వరకు పనిచేశారు. ఫిబ్రవరి ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయి 2014 వరకు పనిచేశారు. తిరిగి జిల్లాలోని నందిపేట్ మండలంలో, భీంగల్ మండలంలో 2018 వరకు పని చేశారు. 2020 ఎన్నికల సమయంలో కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ మండల కేంద్రంలో పనిచేశారు. అలాగే కమ్మర్‌పల్లి, మోర్తాడ్ తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆర్డీవోగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆర్మూర్ ఆర్డీఓ వినోద్ కుమార్, ఆలూర్, ఆర్మూర్ తహసీల్దార్లు దత్తాద్రి, వేణుగోపాల్‌గౌడ్, మిర్ధాపల్లి ఉప సర్పంచ్ మధువర్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. నలుగురు తహసీల్దార్లలో బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి పదోన్నతి పొందడం విశేషం.

కొత్త బ్రిడ్జికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- ఆర్టీసీ చైర్మెన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



జక్రాన్‌పల్లి : వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి

కోలిప్యాక్ గ్రామంలో కొత్త బ్రిడ్జికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్టీసీ చైర్మెన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని పడ్కల్, జక్రాన్‌పల్లి, తొర్లికొండ, కొలిప్యాక్ గ్రామాలలో భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయిన రోడ్లను ఆర్టీసీ చైర్మెన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ పరిశీలించారు.

డిచ్‌పల్లి : మండలంలోని మెంట్రాజ్‌పల్లి చెరువును ఆర్టీసీ చైర్మెన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శనివారం సందర్శించారు. భారీ వర్షాలతో చెరువుకు నీరు చేరడంతో తూము వద్ద చెరువు కట్ట కింది నుంచి నీరు లీకేజ్ అవుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన చెరువును పరిశీలించారు. అనంతరం వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి త్వరగా లీకేజ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు చింతం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : మండలంలో గత వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వాన కారణంగా నిండిన రామడుగు ప్రాజెక్టును శనివారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సందర్శించారు. ప్రాజెక్టు నిండిన సందర్భంగా కట్టమీద కొలువు దీరిన గంగమ్మ అలాగే కట్ట మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వర్షాలకు దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు.

ఎస్ఐ మహేష్‌కు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌ను ఇందల్‌వాయి అంబేద్కర్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంఘం కిష్టయ్య, గౌరవ అధ్యక్షులు చెక్ పవర్ ఎర్రోళ్ల సాయిలు, జిల్లా నాయకులు పాశం కుమార్, సభ్యులు నీరడి గంగాధర్, పాశం నర్సయ్య, బొక్క గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

భారీ వర్షాల్లో ప్రాణ నష్టం జరిగినా కుటుంబానికి రూ.10 లక్షలు, పంట నష్టానికి ఎకరాన రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కార్యాలయంలోని కుమార్ నారాయణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాల కాలం నుంచి ఇంత భారీ వర్షాలు సుమారుగా 67 సెంటీమీటర్ల వర్షాలతో రాష్ట్రంలో సుమారుగా 7, 8 లక్షల ఎకరాలలో వరి, మొక్కజొన్న, సోయా పంటలు నష్ట పోవడమే కాకుండా, పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిందని రైతులు లబోదిబోమంటున్నారని అన్నారు. పట్టణ, నగరాలలో అనేక లోతట్టు ప్రాంతాల్లో గుడిసెలు, నేలమట్టం అయ్యాయని వీరికి ఒక్కొక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత రబీ సీజన్లో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు తాత్కాలిక సాయం కింద పదివేల రూపాయలు ఎకరాన అందిస్తామని కేసీఆర్ ముఖ్యమంత్రి ప్రకటించి ఈ రోజుకు పది పైసలు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రబీ సీజన్ నష్టాన్ని వెంటనే అంచనా వేసి రైతులను ఆదుకోవాలని, రూ.లక్ష రూపాయల రుణాన్ని ఏకకాలంలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మైనారిటీలను అణిచివేసి అధికారంలోకి రావడమే విధానమా..?

నవతెలంగాణ-ఆర్మూర్

మైనార్టీలను అణిచివేసి అధికారంలోకి రావడమే మీ విధానమా అని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. మైనారిటీ మతస్తులు మనుషులేననే కనీస ఆలోచన లేకుండా మణిపూర్‌లో మైనారిటీ ఆదివాసీ ప్రజలపై ముఖ్యంగా, కుకీ తెగకు చెందిన ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం, అడ్డుగా వచ్చిన తండ్రి, తమ్ముడిని చంపేయడం, మహిళలను హత్యలు చేయడం హేయమైన చర్య అని ఈ ఘటనను అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. శనివారం పట్టణంలో మణిపూర్ ఆదివాసీ మహిళను వివస్త్రలను చేసి లైంగికదాడికి పాల్పడిన ఘటనను ఖండిస్తూ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ జిల్లా కార్యదర్శి పోగుల నగేష్ గౌడ్, రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు గంగారం, ఏరియా నాయకులు పెద్దలు బాబు, హరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అసమర్థ పాలన వల్లే రాష్ట్రంలో వరదల బీభత్సం

- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ అసమర్థ పాలన వల్లే రాష్ట్రంలో వరదల వల్ల మును పెన్నడూ లేనంత ఆస్తి, ప్రాణనష్టం జరిగిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ జిల్లా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందన్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశవ వేణు, రూరల్ ఇంచార్జ్ భూపతిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బి.ఆర్.ఎస్ పాలనలో చెరువులు, కుంటలు విచ్చలవిడిగా కబ్జాలకు గురయ్యాయని, చాలా నగరాల్లో బి.ఆర్.ఎస్ నాయకులు కాలువలను కూడా వదలకుండా అక్రమ నిర్మాణాలను చేపట్టారని తద్వారా వరద నీరు ఇళ్లలోకి చేరాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాదాపు నాలుగుసార్లు రాష్ట్రంలో ఇలాంటి దుస్థితి ఏర్పడిందని, గతంలో లేని విధంగా రాష్ట్రంలో వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని, కమీషన్ల కోసం కక్కుర్తి పడి అనవసరమైన చోట అవగాహన లోపంతో చెక్ డ్యాములు నిర్మించడం వల్ల వరద నీరు పంట పొలాలలో ప్రవేశించి రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాల పంట నష్టం జరిగిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్పాగంగారెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రోటరీ క్లబ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో 2023-24 సంవత్సరానికి గానూ రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్టు ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ ఎన్‌వీ హనుమంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 36వ ఇన్స్టాలేషన్ వేడుకలలో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, అసిస్టెంట్ రోటరీ గవర్నర్ శ్రీనివాసరావు పాల్గొంటున్నట్టు నూతన ప్రెసిడెంట్, ట్రెజరర్లు గోపి కృష్ణ పట్వారి, లక్ష్మి నారాయణ తెలిపారు.

వికలాంగులకు ఉచిత బస్‌పాస్ ఖర్చులు భరిస్తా

- ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి

వికలాంగులకు ఉచిత బస్‌పాస్ ఖర్చులు తాను భరిస్తానని ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే 50శాతం ఇస్తున్న ఆర్టీసీ బస్సు పాసులకు అయ్యే ఖర్చులను మండలంలో ఉన్న వికలాంగులకు తన వంతు సహాయ సహకారాలు అందించి ఖర్చులు భరిస్తానని పేర్కొన్నారు. వివరాలకు 7382844221 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ఘనంగా మొహర్రం పండుగ



రెంజల్‌లో పీర్ల ఊరేగింపు

నవతెలంగాణ-రెంజల్/బోధన్

మండలంలో మొహరం పండుగను హిందూ ముస్లిం సోదరులు ఐక్యమత్యంతో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతోపాటు, సాటాపూర్, బోర్గం, వీరన్నగుట్ట గ్రామాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా కురుబలా వద్ద ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఆయా గ్రామాలలోని ప్రధాన వీధుల గుండా పీర్లను ఊరేగించారు.

బోధన్ : త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండగను బోధన్, సాలూర మండలంలో మైనారిటీ సోదరులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత వారం రోజుల నుంచి గ్రామాలలో ఏర్పాటు చేసిన పీరీలను శనివారం సాయంత్రం ఘనంగా ఊరేగించారు. డప్పు చప్పుళ్లతో ఆటపాటలతో గ్రామం నడివీధుల నుంచి ఊరేగింపు నిర్వహించారు. 'ఆశన్న ఊషన్న అన్నదమ్ములే ఆశన్న. ఊషన్నలారా' అంటూ పలువురు గ్రామీణ ప్రాంత కళాకారులు కాలికి గజ్జలతో ఆడుతూ పాడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలలో మతసామరస్యానికి నిలయంగా ఈ పండగ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లింలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జాడి గ్రామంలో పీర్ల పండుగలో గ్రామస్తులు

గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-దోమకొండ

గౌడ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం ఆవరణలో శనివారం ఎన్నుకున్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా రాఘవపల్లి ప్రసాద్ గౌడ్(దోమకొండ) గౌరవాధ్యక్షులుగా కే భూమా గౌడ్ (ముత్యంపేట) ఉపాధ్యక్షులుగా కర్రోల్ల మైసాగౌడ్ (గొట్టిముక్కుల) బూరాణి స్వామి గౌడ్ (అంచనూర్) ప్రధాన కార్యదర్శిగా రంగోల్ రాజా గౌడ్ (అంబారిపేట్)సంయుక్త కార్యదర్శి గుర్రం సాయ గౌడ్ (సంగమేశ్వర్) కోశాధికారిగా కర్రోల శ్యాంసుందర్ గౌడ్(దోమకొండ) కార్యవర్గ సభ్యులుగా పల్లె రామస్వామి గౌడ్, కే లక్ష్మీనారాయణ గౌడ్, మాదగారి రామస్వామి గౌడ్, మెట్టు నారా గౌడ్, రాగుల రాజా గౌడ్, పల్లె పోష గౌడ్, తీగల నాగభూషణం గౌడ్, రంగోల్ లింగాగౌడ్, రాఘవపల్లి రంజిత్ గౌడ్, లింగాల హరి గౌడ్, ముత్యం గౌడ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు.

బాధితుడికి పరామర్శ



ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల మోతే గ్రామానికి చెందిన గుండ్రెడ్డి శివారెడ్డి అనారోగ్య సమస్యతో హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే శనివారం ఆయనను పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

రాజు ధర్మాత్ముడైతే.. రాజ్యం సుభీక్షం

- ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టకపోతే.. కరువు పరిస్థితుల్లో నీళ్లు ఎలా.?
- రూ.86 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరుగుతదా..?
- నిజాంసాగర్‌ను సందర్శించిన స్పీకర్ పోచారం





నీటి విడుదలను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే షిండే.. అనంతరం మాట్లాడుతున్న స్పీకర్

నవతెలంగాణ-కామారెడ్డి(నిజాంసాగర్)

'రాజు ధర్మాత్ముడు అయితే రాజ్యం సుభీక్షంగా ఉంటుంది. నాడు మహాభారతంలో కౌరవుల పాలన కాలంలో ఉన్న కరువు.. పాండవులు రాజ్యం పగ్గాలు చేపట్టగానే పోయి సమృద్ధిగా వర్షాలు కురిసి సుభీక్షంగా మారింది. మన దగ్గర కూడా ఉమ్మడి రాష్ట్ర సమయంలో కరువు ఉండేది. పంటలు సరిగ్గా పండేవి కావు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన దగ్గర నుండి తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్టులు నిండి సమృద్ధిగా పంటలు పండుతున్నాయని' స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని నిజాంసాగర్ సాగునీటి ప్రాజెక్టును ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మీడియా సమావేశంలో స్పీకర్ పోచారం గారు మాట్లాడారు. 'గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు నిండు కుండలుగా మారుతున్నాయి. ప్రపంచంలోని మొదటి భారీ నీటిపారుదల ప్రాజెక్టు నిజాంసాగర్. ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండడానికి కారణం నిజాంసాగర్ ప్రాజెక్టు. ప్రస్తుతం 14.045 అడుగుల లెవల్‌లో 15.03 టీఎంసీల నీటిని నిల్వ చేస్తూ మిగిలిన వరదను ఫ్లడ్ గేట్ల ద్వారా జులై 27 నుండి దిగువన మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటితో ఆయకట్టులోని 1.50 లక్షల ఎకరాలకు ఈ వానాకాలంతో పాటుగా వచ్చే యాసంగిలో కూడా డోకా లేకుండా అందించవచ్చు. ఈ ఏడాది వానాకాలం సాగు కోసం ప్రాజెక్టు చరిత్రలోనే మొదటిసారి జూన్ 21న నీటిని విడుదల చేశాం. రాష్ట్రంలోనే కాదు బహుశా దేశంలోనే వానాకాలంలో ముందస్తుగా నాట్లు వేసే నియోజకవర్గం బాన్సువాడ. వానాకాలం సాగుకు మొత్తం 10 టీఎంసీల నీరు అవసరం. ఆరోజు ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు 5 టీఎంసీలు, వర్షాలు కురవక, ప్రాజెక్టు లోకి నీళ్ళు రాకపోతే వానాకాలం సాగుకు అవసరమైన మరో 5 టీఎంసీల నీటిని కొండపోచమ్మ సాగర్ ద్వారా అందిస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటికైతే వర్షాలు విస్తారంగా కురిసి ప్రాజెక్టులోకి పుష్కలంగా నీళ్ళు వచ్చాయని' తెలిపారు. 'నిజాంసాగర్ ప్రాజెక్టు కింద 1.50 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నది. దీనితో పాటుగా మంజీరా నది వెంట చెక్ డ్యాంలు, ఎత్తిపోతలు, మోటార్ల ద్వారా మరో యాభై వేల ఎకరాలు సాగు చేస్తారు. రాష్ట్ర ప్రజలను, ముఖ్యమంత్రిని ఆ దేవుడు ఆశీర్వదిస్తున్నాడు. రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం 1.50 కోట్ల ఎకరాలకు, దిగుబడులు 3 కోట్ల టన్నులకు పెరిగాయి. నిర్మాణం లోని మిగితా సాగునీటి ప్రాజెక్టులు కూడా పూర్తయితే మరో కోటి టన్నులకు ధాన్యం ఉత్పత్తి పెరుగుతుంది. రూ. 1600 కోట్లతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన పథకం చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వరద కాలువను ఉపయోగించుకుని రోజుకు అర టీఎంసీ నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎత్తిపోయడానికి ఈ పథకం చేపట్టి పూర్తి చేశారు. ఆపత్కాలంలో కరువు పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తే పునరుజ్జీవన పథకం ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఇలా ప్రాజెక్టులను, రిజర్వాయర్లను లింక్ చేసుకోవడం ద్వారా ఒక ఏడాది వర్షాలు పడకపోయినా అవసరమైన సమయంలో నీటిని వాడుకోవచ్చు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్మాణం చేయకపోతే కరువు పరిస్థితులలో నీళ్ళు ఎలా ఇస్తాం? పంటలను ఎలా కాపాడుకోవాలి?. కొంతమంది ఆలోచనలు లేని ప్రతిపక్ష నాయకులు ఈ ప్రాజెక్టుపై విమర్శలు చేస్తున్నారు. వారికి ఆలోచనలు రావు, పనులు చేయరు. నీళ్ళు పుష్కలంగా అందుబాటులో ఉండే ప్రాణహిత నది కలిసే కాళేశ్వరంను వదిలి, నీళ్ళు లేని తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాలని అసంబద్ధంగా వాదిస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం ఖర్చు 86,000 కోట్లు అయితే లక్ష కోట్ల అవినీతి అని విమర్శిస్తున్నారు. రైతులు వానకాలంలో ముందస్తుగా నాట్లు వేసుకోవడం ద్వారా నవంబర్ నెలలో వచ్చే తుఫాన్ల ముప్పు తప్పుతుంది. అదేవిధంగా యాసంగిలో ముందస్తు నాట్లతో ఎప్రిల్ నెలలో కురిసే వడగండ్ల నుండి పంటలను రక్షించుకోవచ్చుని' తెలిపారు. ఆయన వెంట కామారెడ్డి జిల్లా రైతుబంధు అధ్యక్షుడు డి అంజిరెడ్డి, బాన్సువాడ, నిజాంసాగర్, పిట్లం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, సాగునీటి శాఖ ఇంజనీర్లు, అధికారులు ఉన్నారు.

ఘనంగా మొహరం.. షర్బత్ పంపిణీ



ఎల్లారెడ్డిలో షర్బత్ పంపిణీ చేస్తున్న ముస్లిం యువకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/గాంధారి/మద్నూర్

మొహారం సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ని బస్ స్టాండ్ ప్రాంతంలో ముస్లిం యువకులు శనివారం ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా మొహారం సందర్భంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాలు, బాదం, కాజు , ఆక్రోట్, కిస్మిస్, సోంపు వేసి తయారు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యువకులు అజహర్, నబి, రహిమ్, గులాం మహమ్మద్ , హైమాద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో మొహారం పండగ సందర్భంగా ముస్లిం యువకులు పాలతో షర్బత్ చేసి ప్రజలకు పంచి పెట్టారు.

కొడిచర్లలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

మద్నూర్ : మద్నూర్ మండలం కోడిచర్లలో నిర్వహించిన మొహరం పండుగలో మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంతోష్ పటేల్, మాట్లాడుతూ కోడిచర్ల గ్రామంలో అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహిస్తామని, దీంతో మహారాష్ట్ర, కర్నాటక నుంచి ప్రజలు వస్తారని తెలిపారు.

టార్పాలిన్ అందజేత



టార్ఫాలిన్ అందజేత

నవతెలంగాణ-మద్నూర్

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి పైకప్పు దెబ్బతిన్న గోడలు పగుళ్ల ఎర్పడ్డ బాధితుడు ఎక్లారా పెద్ద, మద్నూర్ మండల వాసి గుళేకర్ మష్ణగొండకు రెడ్ క్రాస్ సొసైటీలి మద్నూర్ తరపున మండల చైర్మన్ ప్రకాష్ శనివారం టార్పాలిన్ అదజేశారు.

రిలే నిరాహారదీక్షకు మద్దతు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి గురుప్రతాప్ గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలని గురువారం నుండి ఎల్లారెడ్డి తహశీల్దార్ కార్యాలయం ముందు తల్లీ తెలంగాణ ప్రాంగణంలో నిరాహారదీక్ష చేస్తున్న ఎంపీటీసీకి శనివారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు దీక్ష లో కూర్చుని సాంఘిభావం తెలిపారు. అనంతరం బిజేపీ బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఎంపిటిసి చేస్తున్న డిమాండ్ లను ఎమ్మెల్యే సురేందర్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బైండ్ల పోచన్న, మంగలి సతీష్, కుర్మ సాయిబాబా, ప్రశాంత్, యమా సాయిలు, గజనంద్ తదితరులు పాల్గొన్నారు.

జంకుతున్న వాహనదారులు

- అడ్డగోలు పనులు..

నవతెలంగాణ-సదాశివనగర్



బోల్తా పడ్డ కారు

మండలం లోని పద్మాజివాడి వద్ద రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న విషయంవిధితమే. అయితే రోడ్డు నిర్మాణం చేసేటప్పుడు నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పనులు చేసే దగ్గర నిబంధనలు పాటించకుంటే పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ద్విచక్ర వాహన దారులు తేలిక వాహన దారులు పనులు చేసేవద్ద గుంతనలను చూసి జంకుతున్నారు. తవ్వకాలు చేపట్టిన గుంతలు రాత్రి వేళ ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కన ఎలాంటి సూచికలు పెట్టకపోవడంతో రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

గవర్నమెంట్ లెక్చరర్స్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ఎస్ఆర్‌కే డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గాద వెంకన్న హాజరవ్వగా.. ఆయన ఆధ్వర్యంలో ఎన్నిక చేపట్టారు. జిల్లా అధ్యక్షులుగా నీలం నర్సింలు (మాచారెడ్డి కళాశాల సివిక్స్ లెక్చరర్), ఉపాధ్యక్షులుగా సిద్దయ్య (రామారెడ్డి తెలుగు లెక్చరర్), ఉపాధ్యక్షులుగా జయంత్ మాచారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజు లెక్చరర్ లింగంపేట్, పి మల్లేష్ జూనియర్ కాలేజ్ ఎకనామిక్స్ ట్రెజరుగా, సత్యం జుక్కల్ కార్యనిర్వాహక సభ్యుడుగా గౌరవ సలహాదారులుగా యాదాగౌడ్, చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు శ్రీపతి సురేష్ బాబు,కాముని సుదర్శన్ ,ఉస్మాన్ పాల్గొన్నారు.

ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా పెద్ద చికోడ్ గ్రామానికి చెందినా ధర్మేందర్(34) ఎల్లారెడ్డి పట్టణంలోని బిసి కాలనీలో నివాసం ఉంటున్నాడు. మధ్యాన్నం సమయంలో ఇంటి పైన బట్టలు ఆరవేయడానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య వెళ్లి చూడగా.. ఇంటి వెనకాల పడిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి ఉదయం నుంచి రెండు సార్లు ఫిట్స్ వచ్చాయని, మరోసారి ఫిట్స్ రావడంతో ఇంటిపై నుంచి పడి మృతిచెందినట్టు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, ఒక బాబు ఉన్నాడు. భార్య స్థానికంగా ఏఎన్ఎంగా పనిచేస్తుంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

త్యాగానికి ప్రతీక మొహారం

- ఘనంగా పీర్ల పండుగ

నవతెలంగాణ-లింగంపేట్/పిట్లం



పిట్లంలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు



లింగంపేట్‌లో..

మంచితనాన్ని త్యాగాన్ని స్మరించుకోవడమే పీర్ల పండుగ అని పలువురు పేర్కొన్నారు. శనివారం లింగంపేట మండలం లోని ఆయా గ్రామాల్లో హిందువులు ముస్లింలు పీర్ల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీర్ల వద్ద కుడుకలు బెల్లము దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. దులా ఆట ఆడారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

కులమతాలకతీతంగా పీర్ల పండుగ

పిట్లం : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో మొహార్రం పండుగను కుల మతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో శనివారము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద పేరు (బీబీ ఫాతిమా) ను ఆయా గ్రామాల ప్రధాన వీధులలో మజన , హాస్య నాటికల తో ప్రేక్షకులకు హాస్య భరితంగా పెద్ద పీరు ఊరేగించి బెల్లము , చక్కెర , అగర్బత్తులను నైవేద్యంగా సమర్పిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి , కిష్టాపూర్ , బుర్నాపూర్ , ధర్మారం , గౌరారం గ్రామాలలో ఏ ఒక్క ముస్లిం కుటుంబాలు లేకున్నా హిందువులే ప్రత్యేక చొరవ చూపి సాంప్రదాయ బద్ధంగా పీర్ల పండగ నిర్వహించడం విశేషం. ఈ పండుగలో గ్రామ పెద్దలు , పార్టీల నాయకులు , ప్రజలు పాల్గొన్నారు.

రెగ్యులరైజే మా లక్ష్యం

- యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు



సబితాఇంద్రారెడ్డిని కలిసిన కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టర్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ శనివారం ఉన్నత విద్య శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి తమకు రెగ్యులరైజ్ చేయాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షులు వి.దత్తాహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలకు చెందిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెగరైజ్ టు సర్వీస్ అనే అంశంపై చర్చ జరిగిందని, ఈ చర్చలో జాక్ చైర్మన్ పరశురాం, కాకతీయ యూనివర్సిటీ జాక్ కన్వీనర్ నిరంజన్, 12 యూనివర్సిటీలకు చెందిన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, తెలంగాణ యూనివర్సిటీకి చెందిన అధ్యక్షులు డాక్టర్ వి.దత్తహరి పాల్గొన్నాట్లు వివరించారు. తమ ఏకక లక్ష్యం రెగ్యులరైజ్ టు సర్వీస్ ఒకే ఒక డిమాండ్ కోసం ఆదివారం జరగబోయే క్యాబినెట్ కమిటీలో రెగ్యులరైజ్ ఉండాలని రాష్ట్ర విద్యమంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి మెమోరండం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాక్ కోకన్వీనర్ గంగాకిషన్, నారాయణ గుప్తా, రాథోడ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు ఎక్కడా..?

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(నాగిరెడ్డిపేట్)



మాట్లాడుతున్న వడ్డెపల్లి

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామీలలో భాగంగా పేదోడి పెద్దింటికలను నిజం చేస్తానని కల్లబొల్లి మాటల హామీ ఇచ్చి 2017లో శంకుస్థాపన చేసి అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీలో గెలిచి కోట్ల రూపాయలకు బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడు పోయిన ఎమ్మెల్యే సురేందర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇన్ని రోజులు ఎందుకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పేరుతో ఎన్ని కోట్ల ఇసుక అమ్ముకున్నావో దానికి సంబంధించిన అన్ని విషయాలు కూడా తమ దగ్గర ఉన్నాయని సమయం వచ్చినప్పుడు అన్ని ప్రజల ముందు పెడతామని అన్నారు.

స్వార్ధ లాభం కోసం కోట్ల రూపాయలకు అమ్ముడుపోయిన ఎమ్మెల్యే.. తనను గెలిపించిన కార్యకర్తల గుండెల మీద తన్నిన నీకు రాబోయే రోజులలో కచ్చితంగా గుణపాఠం చెప్తారని అన్నారు .ఈ సందర్భంగా రాబోయే రోజులలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని నిర్మించకపోతే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎక్కడ స్థలం ఉంటే అక్కడ నిర్మించుకునే విధంగా, స్థలం లేకపోతే స్థలం ఇచ్చి 5 లక్షల రూపాయల సహాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహులు, జనార్ధన్ రెడ్డి, ఆఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్లు తప్ప ప్రజల కష్టాలు పట్టించుకోని మంత్రి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి



నీటమునిగి నష్టపోయిన పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీమ్‌గల్

కమీషన్లు తప్ప ప్రజల కష్టాలను మంత్రి పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. గత వారం రోజులుగా కురిసిన అతి భారీ వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను, కూలిపోయిన చెక్ డ్యామ్‌లను భీంగల్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొదిరే స్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి మంత్రి ప్రశాంత్‌రెడ్డి అవసరం లేని దగ్గర కూడా చెక్ డ్యామ్‌లు నిర్మించాడని, అవసరం ఉన్న చోట చెక్ డ్యాంలు నిర్మించాలని, కాంగ్రెస్ పార్టీ చెక్ డ్యామ్‌లను వ్యతిరేకం కాదని, కానీ ప్రశాంత్‌రెడ్డి కమీషన్ల కోసం అవసరం లేని దగ్గర కూడా నిర్మించాడని అన్నారు. ఉదాహరణకు సుంకెటలో రెండు వాగులు కలిసే దగ్గర గానీ, భీంగల్-ఆక్లూర్ మధ్య కార్నర్‌లో గానీ చెక్ డ్యాం నిర్మించడం ద్వారా అది ఏవిధంగా బలపడుతుందో ప్రశాంత్ రెడ్డి చెప్పాలని ఆయన అన్నారు. ఆయన వెంట ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, భీంగల్ పట్టణ అధ్యక్షులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికులను పట్టించుకోరా

- ఉద్యోగ బాధ్యత కల్పించాలి : సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-నసురుల్లాబాద్



మాట్లాడుతున్న ఖలీల్.. నినాదాలు చేస్తున్న కార్మికులు

ఏండ్లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అంటూ సఫాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం బాన్సువాడ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు, కారోబర్లు, సిబ్బంది చేపట్టిన సమ్మె శనివారంతో 24వ రోజుకు చేరింది. వీరికి సీపీఐ(ఎం), సిఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా రవీందర్, ఖలీల్ మాట్లాడుతూ కనీస సౌకర్యాలపై సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు గ్రామాలను శుభ్రం చేసి అద్దంలా తీర్చిదిద్ది ప్రజల ఆరోగ్యాలను కాపాడుతుంటే ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకుండా వివక్షత చూపుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు స్పందిస్తూ గ్రామ పంచాయతీల కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రగతి భవన్‌ను గ్రామపంచాయతీ కార్మికులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఆరోగ్యమే మహాభాగ్యమని క్లబ్ అధ్యక్షులు జి.రామకృష్ణ తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ స్థానిక ఖలీల్‌వాడీలో గల శ్రీ మహాలక్ష్మి పిల్లల ఆసుపత్రిలో తల్లి పిల్లల సంరక్షణకై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కార్యనిర్వహణ అధికారిగా వక్తగా డాక్టర్ జి.హరికృష్ణ హజరై మాట్లాడారు. అనంతరం ఆరోగ్యం గురించిన అంశాలతో కూడిన కరపత్రాలను రోటరీ క్లబ్ నిజామాబాద్ సభ్యులందరూ కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్వీస్ డైరెక్టర్ బాబురావు, సహాయ కార్యదర్శి ఆర్. గంగారెడ్డి, ఉపాధ్యక్షులు బి.విజయరావు, క్లబ్ ట్రైనర్ ఆకుల అశోక్, పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ రాజ్ కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని రెగ్యూలర్ చేయండి

- ఎమ్మెల్యేకు ఔట్ సోర్సింగ్ ఏఈవోల వినతి

నవతెలంగాణ-జుక్కల్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

తమను రెగ్యూలర్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు ఎమ్మెల్యే హన్మంత్‌షిండేకు శనివారం వినతిపత్రం అందజేశారు. పిట్లం మండలంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జుక్కల్ మండల ఏఈవో సంఘం నాయకులు ప్రియాంక, విజయ మాట్లాడుతూ చాలా కాలంగా ఔట్ సోర్సింగ్‌లో ఏఈవోలు గా వ్యవసాయశాఖలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేసి పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యం కల్పించే విధంగా ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసిఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరింప చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మండల ఔట్ సోర్సింగ్ ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పడకేసింది

- ఘన్‌పూర్ గ్రామంలో చెత్తచెదారం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలోని దళిత వాడలో చెత్తను సేకరించటంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వార్డులో అసలు చెత్త, చెదారాన్ని శుభ్రం చేసిన ఆనవాళ్లు లేవని ఆరోపిస్తున్నారు. తమ కాలనీలో చెత్త చెదారాన్ని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.


రోడ్డు కిరువైపులా చెత్త, పిచ్చిమొక్కలు

ప్రజల సహకారంతో సేవలందిస్తా

- బోధన్ ఏసీపీ విజయ సారధి

నవతెలంగాణ-బోధన్‌టౌన్

ప్రజల సహకారంతో సేవలందిస్తానని బోధన్ ఏసీపీ విజయ సారధి అన్నారు. బోధన్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరి సహకారంతో పోలీస్‌శాఖ నియమ నిబంధనల మేరకు పోలీస్ సేవలను అందిస్తామని వివరించారు. గతంలో తాను కరీంనగర్, ములుగు ప్రాంతాల్లో సేవలందించానని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తమను సంప్రదించవచ్చని వివరించారు. బోధన్ ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటూ సేవలను అందించడంలో సమన్వయంతో ముందుకు సాగుతానని ఏసీపీ విజయ సారథి వెల్లడించారు.

సాలూర మండలంలో నీట మునిగిన పంటను పరిశీలన

నవతెలంగాణ-బోధన్

సాలుర మండలంలోని హున్సా, ఖాజాపూర్, సాలూర గ్రామాలలో శనివారం బీజేపీ పార్టీ బోధన్ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు, ఇండ్లు కూలిపోయిన బాధితులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అలాగే బోధన్ పట్టణంలోని కూలిపోయిన ఇంటి పైకప్పు రక్షణ కోసం టార్పాలిన్లు అందజేశారు. వారి వెంట బీజేపీ సీనియర్ నాయకులు, తదితరులున్నారు.

సీడీపీ నిధులు మంజూరు చేసిన అర్బన్ ఎమ్మెల్యే


ప్రొసిడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల గణేష్ గుప్తా ఎస్సీ సంఘం కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణం కోసం సీడీపీ నుంచి నిధులు మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీలను క్యాంపు కార్యాలయంలో సంఘం సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దండు శేఖర్, పవార్ పండరీ, బాబ్యా, సంజీవ్, భీమ్‌రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలం కేంద్రంలోని గాంధీనగర్‌లో భారీ వర్షాల వల్ల నిరాశ్రయులై, కనీస ఆహార లేమితో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ పిలుపు మేరకు బాధితులకు కనీస ఆహార సరుకులు అందించినట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాలేపు నర్సయ్య, బుచ్చి మల్లయ్య సింగిరెడ్డి శేఖర్, సుంకెట శ్రీను, బుచ్చన్న, నాగులు, కృష్ణ, అశోక్, మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని గౌడ్స్ కాలనీలో హన్మంతరావు ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. తాళం పగులకొట్టి 20తులాల బంగారం, రూ.50వేల నగదు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

రెండు పడక గదుల లబ్దిదారుల జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన రెండు పడక గదులకు సంబంధించి రెండవ జాబితాను గ్రామపంచాయతీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో అతికించినట్టు తహసీల్దార్ సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా నుంచి అర్హులను లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈనెల 31వ తేదీ వరకు అభ్యంతరాలను తెలియజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మొదటి జాబితాను వెల్లడించామని, అందులో కొన్ని అభ్యంతరాలను స్వీకరించి విచారణ చేసి అర్హులైన వారిని జాబితాలో ఉంచి, అనర్హులను జాబితా నుండి తొలగించామని తెలిపారు. రెండు పడక గదుల అర్హుల ఎంపిక కోసం లాటరీ తేదీని తదుపరి తెలియజేస్తామని తహసీల్దార్ వివరించారు.

లక్ష్మీ కాలువ ద్వారా నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో ఒకటైన లక్ష్మీ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు శనివారం 100 క్యూసెక్కుల నీటిని ముప్కాల్ మండల ప్రజాప్రతినిధులు, ప్రాజెక్టు అధికారులు కలిసి విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముప్కాల్ జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి హాజరై లక్ష్మీ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం లక్ష్మీ కాలువ డీ-1 ఏఈఈ పిట్ట శేఖర్ మాట్లాడుతూ.. మరో 50 క్యూసెక్కుల నీటిని సాయంకాలం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడుదల చేస్తామన్నారు. ఆయకట్టు రైతులు నీటి విడుదలను గ్రహించాలని కోరారు. ఆయకట్టు రైతులు వేసిన పంటలకు ఈ నీరు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ముప్కాల్, నల్లూర్ గ్రామ సర్పంచులు కొమ్ముల శ్రీనివాస్, జక్కుల సుగుణ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, వేంపల్లి ఉపసర్పంచ్ జక్క గంగాధర్, ఎంపీటీసీ పద్మ, నవీన్, మల్లన్న, సంతోష్, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

రేపు చలో కలెక్టరేట్

- జీపీ కార్మికుల సమస్యలపై..
- విజయవంతం చేయండి
- సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకుల పిలుపు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జీపీ కార్మికుల సమస్యలపై జూలై 31న చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు పిలుపునిచ్చారు. జీపీ ఉద్యోగ, కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని జూలై 6 నుంచి సమ్మె కొనసాగుతుందని రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు 2023 జూలై 31న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా జేఏసీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12,769 గ్రామపంచాయతీలో 50వేల మంది పనిచేస్తున్నారని వీళ్ళందరికీ వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని, ప్రమాదబీమా 10 లక్షలు, సాధారణ బీమా ఐదు లక్షల బీమా పోస్ట్ ఆఫీస్‌లో కట్టాలని, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయమని రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్మికుల బాధని అర్థం చేసుకోకుండా, ఎవరో రాజకీయ నాయకులు రెచ్చగొడితే సమ్మె చేస్తున్నట్లు వ్యాఖ్యానించడం సబబు కాదని, ఆయన వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్మికులందరికీ సంవత్సరానికి మూడు జతల బట్టలు, చెప్పులు, సబ్బులు, నూనెలు సరిపోయే పరికరాలను ఇవ్వాలని, రాష్ట్ర జేఏసీ పెట్టిన 17 డిమాండ్లను పరిష్కరించాలని వారు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. స్వచ్ఛ తెలంగాణలో ముందు బాగాన నిలిచి తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పని చేస్తున్న సఫాయి కార్మికుల పట్ల వివక్షత నిర్లక్ష్యం తగదని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది కార్మికుల కృషి వల్లనే కేంద్రం ప్రభుత్వం అవార్డులు ఇచ్చిన విషయం గుర్తెరగాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్లకు పదోన్నతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జెపి గంగాధర్, నాయకులు గణేష్, సీఐటీయూ జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్
- గోవింద్‌పేట్‌లో వర్షానికి నష్టపోయిన పంటల పరిశీలన


నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. జిల్లాలో వేలాది ఎకరాలు పంటలను రైతులు నష్టపోయారని తెలిపారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో వర్షానికి కొట్టుకుపోయిన పంట పొలాలను శనివారం సందర్శించి రైతులతో మాట్లాడారు. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువులు వాగులు నిండుగా నిండి తెగిపోయి వర్షానికి పొలాలు దెబ్బ తిన్నాయని అన్నారు. గోవింద్‌పేట్ గ్రామంలో శీలం గంగాధర్ రైతు పొలంలో ఇసుక మేటలు ఏర్పడి పంట అంతా నష్టంపోయాడని తెలిపారు. వానాకాలం పంట ప్రారంభ దశలోనే రైతులు వేసిన పంటంతా కొట్టుకుపోయి ఇసుక దెబ్బలు కప్పేశాయని అన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రైతులకు ఎకరానికి రూ.20,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టీ భూమన్న, బి.రవి, సి.గంగాధర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 18 నుంచి తరగతులు

- రాజకీయ శిక్షణా తరగతుల్లో మార్పు



మాట్లాడుతున్న పెద్దివెంకట్రాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉత్తర తెలంగాణ కార్యకర్తలకు మూడు రోజులపాటు జూలై 29, 30, 31 తేదీలలో రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కమిటీ సూచన మేరకు నిర్ణయం తీసుకున్నామని, కానీ ఇటీవల కురిసిన అతివృష్టి కారణంగా ఈ క్లాసులను సమిష్టి ఆలోచన మేరకు ఆగస్టు 18, 19, 20 తేదీలలో నిజామాబాద్ నగరంలోని బస్వా గార్డెన్‌లో జరపాలని నిర్ణయించామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సహాయ కార్యదర్శి నర్ర శంకర్, జిల్లా కమిటీ సభ్యులు గోశం లక్ష్మి, నర్ర కల తెలిపారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మార్పుని గమనించి ప్రతినిధులు ఉమ్మడి ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యల పట్ల ఖండన


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

లంబాడాలను అవమానించే విధంగా మాట్లాడిన ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపురావును వెంటనే సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. అన్నదమ్ములుగా బతుకుతున్న కోయ, గోండు, లంబాడీలను విడగొట్టాలని రాజకీయం చేస్తూ విష ప్రచారం చేస్తున్న సోయం బాపురావును బీజేపీ నుంచి సస్పెండ్ చేయకపోతే పెద్ద ఎత్తున బంజారా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షులు జాదవ్ ప్రవీణ్ నాయక్ అన్నారు. లంబాడీలను ఎస్టీ తెగల జాబితా నుంచి తీసివేయాలని పదే పదే పార్లమెంట్‌లో ప్రసంగించడం సరి కాదని తీవ్రంగా ఖండించారు. లంబాడీలు వలసవాదులని ఉద్దేశపూర్వక రెచ్చగొట్టే వ్యాక్యాలు చేస్తున్న సోయం బాపురావుపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు రవి నాయక్, సాయి బాబు, బోధన్ పట్టణ యూత్ అధ్యక్షులు శంకర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు, యువకులు చేపల వేటకు వెళితే కఠిన చర్యలు

- కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్


చేపలు పడుతున్న యువకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పిల్లలు, యువకులు చేపల వేటకి వెళ్లినట్టు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మండల నాయకులు, పెద్దలు, యువకులకు పోలీస్ శాఖ తరపున విజ్ఞప్తి చేశారు. "కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లోని అన్ని చెరువులు నిండి అలుగులు (మత్తడిలు) దూకుతున్నాయి. కుంటలు నిండి ఉన్నాయి. వాగులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో చేపల వేటకు వెళ్లి మృత్యువాత, గల్లంతైన ఘటనలను చోటుచేసుకున్నాయి. మండలంలో కూడా చాలా మంది ఎంత చెప్పినా వినకుండా చెక్ డ్యామ్‌ల వద్దకు, చెరువుల వద్దకు చేపలు పట్టడానికి వెళ్తున్నారు. పాఠశాలలకు, కాలేజ్‌లకు సెలవులు ఉన్నందున ఇంట్లో నుంచి విద్యార్థులను చేపల వేటకు తమ తల్లిదండ్రులు పోనివ్వద్దు. చెరువులు, వాగులు, చెక్‌డ్యామ్‌లు, నీళ్ల ప్రవాహం ఉన్న ప్రదేశాలలో పోలీసులు గస్తీ నిర్వహిస్తారు. ఎవరైనా పిల్లలు, యువకులు చేపల వేటకి వెళ్లినట్టు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం." అని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని కట్ట మహేష్ నూతన కాంప్లెక్స్‌లో 'బ్లెడ్ డోనేషన్ క్యాంపు' రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ బాబురావు జన్మదినం సందర్భంగా ఈ 'బ్లెడ్ డోనేషన్ క్యాంపు' ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దాదాపు 20 మంది యువకులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని క్యాంపును విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రటరీ కట్ట మహేష్, ట్రెజరర్ జక్కుల రాము, స్టూడియో శ్రీను, పెండెం జీవన్, సిద్ధ రమేష్, టీవీ శంకర్, చిల్క దినేష్, ఏలేటి విజయ్, గడ్డం సురేష్, గంగాధర్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుంగిపోయిన రోడ్డు


రోడ్డు కుంగడంతో ఏర్పడిన గుంత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని ప్రశాంతి టవర్స్ నుంచి వినాయకుల బావి వైపు వెళ్లే రోడ్డు కూరుకుపోయింది. రోడ్డు పనుల్లో నాణ్యత లోపంతో ఎక్కడికక్కడే రోడ్డు కుంగిపోతోందని నిజామాబాద్ నగర ప్రజలు అంటున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై, అది పరిశీలించిన బిల్లులు చెల్లించిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

వర్షం బాధితులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ బృందం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని గూపన్‌పల్లి వాగు పొంగి నిరాశ్రయులైన 60 కుటుంబాలకు రెడ్‌క్రాస్ సభ్యులు సొంత విరాళాలతో దుప్పట్లు శనివారం పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ.. నిరాశ్రయులైన కుటుంబాలకు ముమ్ముందు కూడా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని, అదే విధంగా జిల్లాలోని వర్ష బాధితులకు మండల కమిటీల ద్వారా పాక్షికంగా లేదా పూర్తిగా ఇల్లు దెబ్బతిన్న వారికీ తాటిపత్రాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎం.ఆర్.ఓ అనిల్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, కార్యదర్శి అరుణ్ బాబు, ఈ.సి సభ్యుడు వెంకట కృష్ణ, రూరల్ చైర్మన్ నర్సింహం, వైస్ చైర్మన్ నాగభూషణం, గూపన్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా టార్పాలిన్లు వితరణ


టార్పాలిన్లు వితరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని సేవాలాల్ తండా, బెల్యా నాయక్ తండాలో పలువురు బాధితులకు కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్‌రావు తన సొంత ఖర్చుతో టార్పాలిన్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూనిపూర్ రాజారెడ్డి, గంగప్రసాద్, గంగప్ప, బానోత్ రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ ఎస్ఐగా జి.రాహుల్


బాధ్యతలు చేపడుతున్న ఎస్ఐ

నవతెలంగాణ-నందిపేట్

నందిపేట్ ఎస్ఐగా జి.రాహుల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిర్మల్ జిల్లా లక్ష్మణ్ చందా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ శ్రీకాంత్ లక్ష్మణచందకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ జి.రాహుల్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు వికార్ పాషా సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. రేపని హనుమంతుకు రూ.26వేలు, డి.గంగాధర్‌కు రూ.12వేలు, కె.గంగామణికి రూ.16వేలు, పిట్ల శైలజకు రూ.16వేల చెక్కులను పంపిణీ చేశారు. దీనికి సహకరించిన సీఎం కేసీఆర్, బోధన్ ఎమ్మెల్యే మొహమ్మద్ షకీల్ అమీర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్కే అహ్మద్, మండల ఉపాధ్యక్షులు హాజీ ఖాన్, కె.సాయిలు, భూమేష్, చంద్రశేఖర్, నరేష్, సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.